సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 02 | సంచిక : 90 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 25.07.2025

## వావ్.. బొగత..!

### జలధారలా.. పాలనురగలా..!



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం కనువిందు చేస్తోంది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వార్షా లకు బొగత పరవళ్లు తొక్కుతోంది. ఎగిసిపడుతున్న జలధారలు పాలనురగలను తలిస్తూ అందరినీ ఆకట్టుకుంటోంది. బొగతకు వరద ప్రవాహం ఎక్కువ కావడంతో అటవీశాఖ అధికారులు సందర్శనను నిషేధించారు.



కృష్ణమాచార్య సిద్ధాంతికి
‘జ్యోతిష్య గణకాచార్య’
## పురస్కారం

3 లో

జిల్లాలో యూరియా
## కొరత లేదు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



2 లో



3 లో

విద్యార్థుల ఆరోగ్యంపై
## దృష్టి పెట్టాలి

- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

# కాంగ్రెస్ హయాంలోనే రేషన్ కార్డులు

- జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** గతంలో కాంగ్రెస్ హయాంలో రేషన్ కార్డులు ఇచ్చారని, మళ్లీ తాము అధికారంలో వచ్చాకే కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండే ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చిందా అని ప్రశ్నించారు. గురువారం జనగామ మండలం ఎర్రగొల్ల పహాడ్ పంచాయతీలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పేదల గుండెలో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెరుగు బాలరాజ్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిర్ర సత్యనారాయణ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బన్సి నాయక్, మాజీ సర్పంచ్ బైరగోని చంద్రం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాశ్ యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ శేఖర్, నాయకులు కనకయ్య, శ్రీనివాస్, రాజు, రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు రఘు గౌడ్, రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.













# యూరియా కొరత లేదు

- అమ్మకాల వివరాలు స్పష్టంగా ఉండాలి
- రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు
- జిల్లాలో కలెక్టర్ విస్తృత తనిఖీలు
- ఫర్టిలైజర్ షాపులు, సీహెచ్‌సీ, కేజీవీబీలను పరిశీలన

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా యూరియా కొరత లేదని, ఎవరైనా కావాలని కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఓపీ పేషంటుకి టెస్టులు చేసి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం కలెక్టర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా జనగామ పట్టణంలోని కావేరి, సాయిరాం ఫర్టిలైజర్ షాప్లను సందర్శించి ఇప్పటి వరకు జరిగిన అమ్మకాలను పరిశీలించారు. ఆ షాపుల్లో యూరియాను కొనుగోలు చేసిన రైతులకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఈవో ఫోన్ చేసి.. ఎప్పుడు తీసుకున్నారు, మీకు ఎన్ని ఎకరాలు ఉంది, ఎంత యూరియా తీసుకున్నారు, ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయి అని అడిగి తెలుసుకున్నారు. సాయిరాం ఫర్టిలైజర్ షాప్ లో ధరల పట్టిక, స్టాక్ వివరాలు తెలిపే బోర్డు బయట ఉండకపోవడంతో కలెక్టర్ షాపు యజమానులను పిలిచి అందరికీ కనబడేలా బోర్డును ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతి రోజు జరిగే యూరియా కొనుగోలుకు సంబంధించి రైతు ఫోన్ నెంబర్ తో సహా అన్ని వివరాలు ఉండాలన్నారు. అనంతరం జాఫర్‌గఢ్ మండలానికి వెళ్లిన వెళ్లిన కలెక్టర్ జాఫర్‌గఢ్ లోని.. వెంకటేశ్వర, ఆగ్రోస్ రైతు కేంద్రంలోని యూరియా అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామ జిల్లాలో 3,560 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదని, సరిపడా బఫర్ స్టాక్ కూడా మార్క్ ఫెడ్ గోదాంలలో ఉన్నాయని, రైతులకు ఏదైనా సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్‌కు 89777 45512 సంప్రదించవచ్చాన్నారు. అనంతరం సిహెచ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి వైద్యుల అటెండెన్స్, ఓపీ, ల్యాబ్ టెస్ట్, ఈడీడీ రిజిస్టర్లను పరిశీలించారు. ఆ తర్వాత కేజీబీని సందర్శించారు. ముందుగా వంటకు ఉపయోగించే కిరాణం సరుకులను పరిశీలించి నాణ్యతతో ఉన్నాయా లేదా అని చెక్ చేశారు. చివరగా పదవ తరగతి క్లాస్ రూమ్ లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, విద్య, వైద్య అధికారులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి : యూఎస్పీసీ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల తక్షణ పరిష్కారం కోసం దశల వారి పోరాటంలో భాగంగా గురువారం బచ్చన్నపేట మండల తహసీల్దార్ రామాజనుచారి ద్వారా సీఎం మెమోరాండం సమర్పించారు. యూఎస్పీసీ జిల్లా నాయకులు మదూరి వెంకటేశ్, ఇప్ప రాంరెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, 40 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక టీచర్ ఉండాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పీఆర్ఎస్ నివేదికను తెప్పించుకొని 1 జూలై 2023 నుంచి అమలు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిచో ఆగస్టు 1న జనగామ జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యూఎస్పీసీ సి భాగస్వామ్య సంఘాల నాయకులు చొక్కయ్య, ఎం కృష్ణమూర్తి, మల్లారెడ్డి, జి.శ్రీనివాస్, శ్రీవాస్ రెడ్డి, ఎం.యాదగిరి, నర్సింహారెడ్డి, రమేష్, టి.యాదగిరి, జీవనకుమారి, లక్ష్మీనర్సమ్మ, విజయ పాల్గొన్నారు.




# ఘనంగా స్నేహ సంఘం మహాసభ

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** మేకలగట్టు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్నేహ సంఘం 16వ మహాసభ కార్యక్రమం గురువారం జరిగింది. సంఘం అధ్యక్షురాలు సట్ల సాధిక అధ్యక్షతన జరిగిన ఈ మీటింగ్‌లో సంఘం విజయాలు, ఆర్థిక లావాదేవీలు అందరికీ వివరించారు. మండల స్థాయిలో తమ సంఘానికి 3వ ర్యాంకు వచ్చిందని, నియోజకవర్గ స్థాయిలో ఇందిరా మహిళ శక్తి సంబురాలలో ఎమ్మెల్యే చేతుల మీద ప్రశంశ పత్రం అందుకున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు వంగాల రజిత, ముక్క స్వర్ణలత, గోపగోని విజయ, ఏం.డి షనాజీ బేగం, దాసరి మంజుల, మాజీ సర్పంచ్ సంధ్యారాణి, మాజీ ఏంపీటీసీ బానోత్ భిక్షపతి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఉడుత గోపాల్, నాయకులు, సభ్యులు ఉడుత సిద్దమ్మ, స్వాతి, కళ్యాణి, అరుణ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమాచార్య సిద్ధాంతికి 'జ్యోతిష్య గణకాచార్య' పురస్కారం

**జనగామ, మన చౌరాస్తా :** యాదాద్రి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి జనగామ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం ప్రధాన అర్చకుడు శ్రీమాన్ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతికి 'జ్యోతిష్య గణకాచార్య' బిరుదు ప్రదానం చేశారు. పరాశరా అకాడమీ ఆఫ్ ఆస్ట్రాలోజికల్ సైన్స్, హైదరాబాద్ సంస్థ వారు ఈ పురస్కారాన్ని అందించి సన్మానించారు. అకాడమీ నిర్వాహకులు డా.నాగులపల్లి మహేశ్ చందర్ భరద్వాజ్ రచించిన 'సనాతన ధర్మం - జ్యోతిష్యం' 23వ పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా జనగామ సిద్ధాంతికి బిరుదు ప్రదానం చేశారు. జూలై 23 బుధవారం రాత్రి త్యాగరాయ గాన సభ లో జరిగిన ఈ వేడుకకు శృంగేరీ పీఠం ఆస్థాన జ్యోతిష్య విద్వాంసులు డా.శంకరమంచి రామకృష్ణ శాస్త్రి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు డా. సి.వి. సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా శృంగేరీ జ్యోతిష్య పండితులు బ్రహ్మశ్రీ విరివింటి ఫణి శశాంక శర్మ పాల్గొన్నారు. శృంగేరీ ఉభయ తెలుగు రాష్ట్రాల సంచాలకులు పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య సనాతనధర్మం జ్యోతిష్యం పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. వక్తలందరూ జ్యోతిష్య గణకాచార్య బిరుదాంకితులైన కృష్ణమాచార్య సిద్ధాంతి ప్రతిభా పాటవాలను అభినందిస్తూ ప్రసంగించారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యవహరించిన పి. మోహన్ కుమార్ గాంధీ సభికులను రంజింపచేశారు. జనగామ సిద్ధాంతి సంపత్కుమార కృష్ణమాచార్య కు జ్యోతిష్య గణకాచార్య బిరుదు ప్రదానం జరగడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తనను గుర్తించి బిరుదు ప్రదానం చేసిన పరాశరా అకాడమీ ఆఫ్ ఆస్ట్రోలజికల్ సైన్స్ హైదరాబాద్ సంస్థ నిర్వాహకులకు కృష్ణమాచార్య సిద్ధాంతి కృతజ్ఞతలు తెలిపారు.





# విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



**కొడకండ్ల, మన చౌరాస్తా:** విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, భోజన నాణ్యతను పరిశీలించేందుకు కలిసి భోజనం చేయాలని అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ సూచించారు. గురువారం ఆయన జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమాధికారులతో కలిసి కొడకండ్లలోని తెలంగాణ ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో వసతి గృహాలను సందర్శించాలన్నారు. సిబ్బంది పనితీరును పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుకోవాలన్నారు. సమస్యలుంటే తక్షణం పరిష్కరించాలన్నారు. పరిశుభ్రతపై ప్రధానంగా దృష్టి పెట్టాలని, భోజనం చేసే ముందు చేతులు కడిగే విధానం తెలియజేస్తూ అవగాహన పరచాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజు వేడిచేసి చల్లార్చిన తాగునీటి ఇవ్వాలన్నారు. అనంతరం అదే మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. వర్షాకాలం కావడంతో విషపురుగులు రాకుండా చుట్టు పక్కల చెత్తను తొలగింపు చేయాలన్నారు. ఆయన వెంట ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, ఎంపీడీవో నాగ శేష సూరి, రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది ఉన్నారు.



# ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజలందరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. రోడ్ సేఫ్టీపై గురువారం డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రివ్యూ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను, వాటి నివారణకు తీసుకోవలిసిన చర్యలను చర్చించారు. వాహనదారులు బైక్‌పై వెళ్లినప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ ధరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రాంగ్ రూట్‌లో ప్రయాణించరాదన్నారు. గ్రామాల్లో మూలమలుపుల వద్ద రోడ్ క్లియర్‌గా కనపడేలా ఉండాలన్నారు. అవసరమైన చోట సైన్, కాషన్ బోర్డ్స్, లైటింగ్ పెట్టాలన్నారు. గతంలో మీటింగ్ జరిగిన నాటి నుంచి నేటి వరకు రోడ్ ప్రమాదాలు చాలా వరకు తగ్గాయని, అస్సలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పని చేయాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలను నడపాలని, లేకుంటే లైసెన్స్ లను రద్దు చేయడమే కాకుండా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం లో పోలీస్, ఆర్టీఏ, ఎక్సైజ్, ఆర్ అండ్ బీ, పీఆర్, రెవెన్యూ, నేషనల్ హైవేకి సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు




**బచ్చన్నపేట, మన చౌరాస్తా:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు బచ్చన్నపేట మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కేటీఆర్ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, కేటీఆర్ ప్రజాక్షేత్రంలో ఉండి పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించి ఇంకెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని ఈ సందర్భంగా కోరుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, పట్టణ అధ్యక్షుడు నరేందర్, మాజీ సర్పంచ్ మల్లా రెడ్డి, నాయకులు కొండి వెంకట్ రెడ్డి, బొమ్మెన ఆంజనేయులు, అజీమ్ బొమ్మన సందీప్, వేణు గోపాల్, గోపి, సిద్దిరామ్ రెడ్డి, కైసర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# బంద్‌ను విజయవంతం చేయాలని ర్యాలీ

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ కోరింది. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం గజ్జకుంట క్రాస్ నుంచి ముస్త్యాల గ్రామ శివారు వరకు బైక్ ర్యాలీ నిర్వహించి వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, జేఏసీ ప్రతినిధులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, కరెడ్ల రఘుపతి రెడ్డి, పోలోజు వెంకటాద్రి, ఎక్కలదేవి సుధాకర్, జంగిలి యాదగిరి, రామగల్ల నరేష్, కత్తుల భాస్కర్ రెడ్డి, కుడిక్యాల బాల్ మోహన్, వలబోజు నరసింహాచారి, కర్రె నర్సి రెడ్డి, పుల్ల ఆంజనేయులు, గడిపే రవి, పోసుగోటి శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# కాల్వ మరమ్మతుకు నిధులు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామ శివారులో నుంచి కొడవటూర్ గ్రామ ఊర చెరువు వరకు గోదావరి జలాల రవాణాకై నిర్మించిన కాలువ మరమ్మతు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ విషయాన్ని బండనాగారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇజ్జగిరి రాములు వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గోదావరి పైప్‌లైన్ డెలివరీ పాయింట్ నుంచి కొడవటూర్ ఊర చెరువు వరకు నీటి ప్రవాహం సాగేందుకు అవసరమైన కాలువ మరమ్మతుల కోసం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పట్టు పట్టడంతో నీటిపారుదల శాఖ ద్వారా రూ.10.15 లక్షల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డికి ఆయా గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్ల నర్సిరెడ్డి, ఇజ్జగిరి నరేష్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మం కోసం యుద్ధం




## పవర్ స్టార్ ఆల్ టైం రికార్డ్

బ్రో సినిమా తర్వాత పవన్ కళ్యాణ్ నటించిన లేటేస్ట్ మూవీ హరి హర వీరమల్లు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ నటించిన తొలి చిత్రం ఇదే. దీంతో ఈ సినిమా కోసం పవన్ అభిమానులు, ప్రపంచవ్యాప్తంగా మూవీ లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. మొదటి నుంచి ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఫస్ట్ పోస్టర్ నుంచి ట్రైలర్ వరకు ప్రతి అప్డేట్ పై ఓ రేంజ్ హైప్ నెలకొంది. దాదాపు ఐదేళ్లుగా షూటింగ్ జరుపుకున్న ఈ సినిమా ఇప్పుడు ఎట్టకేలకు అడియన్స్ ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య జూలై 24న వరల్డ్ వైడ్ థియేటర్లలో విడుదలైంది. చాలా కాలం తర్వాత పవన్ కళ్యాణ్ మాస్, యాక్షన్ స్వాగ్ బిగ్ స్క్రీన్ పై చూడడంతో అభిమానుల సంతోషం గురించి చెప్పక్కర్లేదు. ఈ సినిమాలో ఎప్పటిలాగే పవన్ యాక్టింగ్ అదిరిపోయిందని.. సినిమా బ్లాక్ బస్టర్ హిట్టు అంటూ ట్విట్టర్ ఖాతాలో ఫ్యాన్స్ హడావిడి మాములుగా లేదు. ఇక విడుదలకు ముందే తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్ షోలు పడ్డాయి. ప్రీమియర్స్ తోపాటు ఓపెనింగ్ డే గురువారం భారీ స్థాయిలో థియేటర్లు ఫుల్ అయ్యాయి. ఈ సినిమాకు భారీగా హైప్ ఉండడంతో ప్రీమియర్ షోతోపాటు ఓపెనింగ్ డే బెనిఫిడ్ షో, మార్నింగ్ షో, మ్యాట్నీ హౌస్ ఫుల్ షోలతో రన్ అవుతుంది. బాక్సాఫీస్ వద్ద తుఫానుగా నిలిచిన ఈ సినిమా పవన్ కెరీర్ లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా నిలిచింది. పవన్ కళ్యాణ్ కెరీర్ లో అత్యధిక వసూళ్లు సాధించిన ఓపెనింగ్స్ లో ఒకటిగా నిలిచిన ఈ చిత్రం మొదటి రోజే మన దేశంలో రూ.31.50 కోట్లు రాబట్టినట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రీమియర్ షోల ద్వారా రూ.12.7 కోట్లు వసూలు చేసి, మొత్తం రూ.43.8 కోట్లు రాబట్టినట్లు సమాచారం. తెలుగు వెర్షన్ ప్రారంభ రోజున సగటున 57.39% ఆక్యుపెన్సీని నమోదు చేసింది.